తెల్లవారగట్ల వేగుచుక్క పొడిచింది, మేము కథవినుట ముగించి నింగివైపు చూచేసరికి ఓహెూ మగవానికి మగతనమెట్టిదో తెనుగుపుస్తకానికి తెనుగుందన మట్టిది! తెనుగుందనము వెల్ల డింపని వ్రాతకు తెనుగునగరమ్ముల తెనుగు పట్టణమ్ములతెనుగు కుప్పమ్ముల నొకదాని నొక్కంటి నతుకుచు నతి విచిత్రగతి విరచింపని విరచనమునకు విలువ యిచ్చుట చెరువులోని కలువల నన్నింటిని గలుపుచు నొకే నీరతలమ్మున బోషింపకయే కలువనాకలువ నొకానొక ముంతొడు నీళ్ళలో మొలిపించుట వంటిదిగాదే!

... ... ... ... ...

## నిశ్చింత

పూర్వం రెండవతరగతి బండియే

ఇప్పటి మొదటితరగతి బండి అని అనుకుంటూ రెండు గీతల్లోంచి ఒకగీత కొట్టెయ్యగా నిల్చివున్న ఒక గీతగల పరుపులపెట్టె ఎక్కాడు సుందరరావు. రైలు అసలు మెయిలు. అందులో ఇది పరుపులపెట్టె! మంచి టీగ్గావుంది. పైనోమూడు "బెర్తులు" క్రిందో మూడు "బెర్తులు" రెండుమూడు "ఫానులు" ఆ వరుసనే "లైట్లు" ఒక మేజాబల్ల, బూడిదదులుపు కునే 'ట్రే'లు, అద్దం నీళ్ళుగల "లావెటరీ" వీటన్నిటితోటి ఆ పెట్టె ఏలావుంది? 'అప్సరస' మినహా స్వర్గతుల్యంగావుంది. అప్సరస రావడానికి అది 'మేల్ రిసర్వ్' అయినా అప్సరసలకన్న అందం వొలికించే బొమ్మలున్న 'మాగజీ'నులు ఇంగ్లీషుని తమిళానివి హిందీని ఆ పెట్టెలో వున్నాయి! ఎలా వచ్చాయి ఇన్ని మాగజీనులు అని అడుగుతారేమో! అది మెయిల్ గాడీ! హౌరానుండి మదరాసుదాకా పోయేది! కూర్చున్నమనుష్యులుకూడా కలకత్తా నుండి కొందరు, వాల్తేరునుండి కొందరు ప్రయాణిస్తూ వున్న

వాళ్ళు ఒకళ్ళభాష ఒకళ్ళకు రాదుగాని, ఒకళ్ళ కొకళ్ళు అభి ప్రాయాల్ని వెలిబుచ్చుకోవడంలో వెంబాటులేనివాళ్ళు. వాళ్లూ వాళ్లూ ఏదో పనిమీదనే వెడుతూవున్నారు. సోమారిపోతులు కారు మనలాగ!

ఒకచోట ఒక స్టేషన్‌వద్ద 'మెయి' లాగింది ముందు బద్దీల మీద. 'టావ్' 'లైన్' బద్దీలమీద 'గుడ్సు' బండి ఆగింది. గుడ్సు బండి కావల కాబోలు ఆ కుటుంబం కుటుంబం కలిమి కలిగిన వాళ్లే అవసరాన్నిబట్టి ఆ తాపత్రయం పడ్డారు. ఆడా మగా పిల్లా జెల్లా ఓ పదిమంది రైలుచెంబు, 'టార్చి' దేఖీలతో సహా 'గుడ్సు' బండి క్రిందనుంచి దూరివచ్చి ఈ మెయిల్‌గాడీ మొదటితరగతి బండిలో పడ్డారు. ఆ వెనకాల రైలుకూలీలు స్యూటుకేసులు బెడ్డింగులు వాళ్ళు వచ్చిపడ్డారు.

'గుడ్సు' బండి కదిలింది. మెయిలుబండి కదిలింది. ఒకటి ఒకవైపుకు ఒకటి మరొక వైపునకు. అంతా ఆశ్చర్యపోయినారు. "ఎంత మోసమైయుండేది! ఆ గుడ్సుబండి మరో నిమిషంముందు కదిలినా, మెయిలు ఎక్కడంలో కదిలినా" అని అంటూ!

ఆ ఎక్కిన కొత్తజనం మాత్రం, వాళ్ళు మళ్ళీ కలిగినవాళ్లు 'కల్చర్' గలవాళ్ళు ఏమీ అనుకోవడంలేదు. వాళ్ళు మెయిలు బండి పొండిగ్గా ఎక్కి కూర్చున్నారు. ఈ ఖంగారంతా అంతక్రితం బండిలో ఉన్న వాళ్ళదే! ఈ ఆలోచన అంతా బండిలో అంత క్రితం ఉన్నవాళ్ళదే!

'వీళ్ళ' అనగా బండిలో అంతక్రితం వున్నవాళ్ళ ఆశ్చర్యం చూసి, ఆఖరుకు కొత్తగా ఎక్కినవారిలో ఒకాయన అన్నారు "అది మాకు పరిపాటే! రైలు కూలీల ఎర్రతలపాగా లిటూ అటూ తిరుగుతూన్నంతసేపూ ఏ బండీ కదల్దు, అటు 'గుడ్సు' కదల్దు! ఇటు మెయిలూ కదల్దు! గంట లెన్నికొట్టినా, జెండా లెన్ని చూపించినా ఈల లెన్నివేసినా!" అని.

"బాబా! మేమూకాదు మా తలపాగాలుకాదు, ఇదంతా బగమంతుడి మాయ! మాయ కాకపోతే మరేంటి? మీరు ఎక్కి అంతసేపూ మెయిలు నిలబడ్డ మేమిటి? నేను దిగేలో "దిగొద్దు! బండి కదుల్తూవుంది అని గార్డుదొర అనడమేటి? యిడ్డూరంగా వుంది నేటిపొద్దు! తమరు మా దొడ్డమారాజులు మరో రెండణాలు ఇప్పించండి!" అన్నాడు ఒక కూలి బండిలో వుండిపోయి.

"నీవు ఎక్కడ దిగుతావు మరి?" అన్నాడు ప్రయాణీకుడు రెండణాలు వానిచేతపడేస్తూ, వానివైపు చూస్తూ.

"అంతా బగమంతుడిమాయ చూస్తూవుండండి! ఎక్కడ దిగుతానో!" అని అల్లా మెల్లిగా దిగాడు కూలీ! బండి వేగం తగ్గించగా సుందరరావు అన్నాడు "ఇదంతా కూలీల్లోవుంది" అని తెనుగు భాషను. ఆ భాషరానివాళ్లు తలలు త్రిప్పారు. "ఎవరిలో మాయవుంటేం! మెయి లందుకున్నాం!" అన్నారు క్రొత్తప్రయాణీకులు నిశ్చింతగా!

... ... ... ... ...

## మీకు తెలియదండీ?

ప్రకాశం "నాన్నగారూ! ఆకాశం మీదనుంచి మొన్న మన పెరట్లో పడ్డ వడగ గట్టిగావుండి నోట్లో పెట్టుకుంటే జిల్లుమంది. అంతలో కరిగిపోయింది. ఇదేమిటండీ! సముద్రములోనుంచి వచ్చిపడిన ఈ వడగ ఇలా మెత్తగావుంది! తుప్ తుప్" మని అన్నాడు చేతిలో ఒక మెత్తనిపదార్థం పెట్టుకు.

ప్రకాశం ముఖంకేసి చేతికేసి అలా చూచాడు వాళ్ళనాన్న! "ఓరేవ్! దాన్ని నోట్లో పెట్టుకున్నావా? ఏమిట్రా? చెప్పరా? అది వడగకాదురా! దానిని తినరురా! చెప్పరా పెద్దవాళ్లతో చెప్ప కుండా కొత్తవస్తువ ఏదీ కుర్రవాళ్ళు తినగూడదురా! ఏదిపడితే అది తినేసెయ్యడమే?" అని అన్నాడుకూడాను కోపంగా.